న్యూస్‌రీల్

పంట నష్టం నమోదు చేయాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మిచాంగ్ తుఫాన్ కారణంగా జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడైనా పంట నష్టం సంభవిస్తే రైతులు వారి స్థానిక రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి వివరాలు తెలియజేయవచ్చని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. తుఫాను తదనంతర పరిస్థితులపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర ముఖ్య అధికారులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమరావతి నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరిగితే రెండు రోజుల్లో నివేదించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ జి.ఆర్.రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా వ్యవసాయాధికారి కే.శ్రీధర్, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి, కృష్ణమూర్తి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. అంపోలు గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మీకి రూ.5లక్షలు, శ్యాంపాలెంకు చెందిన లొడ్డు రాధకు రూ.1.5 లక్షల చెక్కును అందించారు. కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

సాధికార బస్సుయాత్ర వాయిదా



ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలో ఈ నెల 10న జరగాల్సిన సామాజిక సాధికార బస్సుయాత్ర వాయిదాపడిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం తెలిపారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టం జరిగిందని, రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉన్నందున యాత్రను వాయిదా వేస్తున్నట్లు అధిష్ఠానం నుంచి సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. తదుపరి తేదీ తరువాత ప్రకటిస్తామని చెప్పారు.

ముంచేసింది

- తుఫాన్‌తో నీట మునిగిన పంట పొలాలు
- 1258 హెక్టార్లకు ముప్పు వాటిల్లినట్టు అంచనా
- పూర్తి స్థాయి నష్టాన్ని అంచనా వేసేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు
- ప్రభుత్వ చర్యలతో రైతులకు ఊరట
- నూర్చిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయడంతో తప్పిన భారీ నష్టం



ఎచ్చెర్ల క్యాంపస్: చినరావుపల్లిలో కూలిన సంబాడ లక్ష్మి పెంకుటిల్లు



పీఎన్‌కాలనీ 2వ లైన్‌లో జోరు వానలో రేషన్ అందిస్తున్న వలంటీర్ మురళి, ఆపరేటర్ అప్పారావు



రణస్థలం: అర్జునవలసలో నీటమునిగిన వరి పనలను బయటకు తీస్తున్న రైతు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: మిచాంగ్ తుఫాన్ తీరం దాటాక వర్షం దంచి కొట్టింది. జిల్లాలో తెరిపిచ్చినట్టే ఇచ్చి ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. జనజీవనానికి పెద్ద ఇబ్బంది లేకపోయినా పంట పొలాలు నీట మునిగాయి. కొన్ని చోట్ల వరిచేను నేలకొరిగింది. మరికొన్నిచోట్ల కోసిన వరి పంట నీట మునిగింది. ప్రభుత్వం తీసుకున్న సత్వర చర్యలతో రైతాంగం కాసింత ఊపిరిపీల్చుకుంది. అప్పటికే తమ వద్ద నూర్చిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా సకాలంలో కొనుగోలు చేయడంతో నష్టం తప్పింది. ఈ ప్రక్రియలో వలంటీర్ల సేవలు ప్రశంసనీయం. ఆపదలో ఉన్న రైతులను గుర్తించడమే కాకుండా వారి వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వెంటనే కొనుగోలు చేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారు.

404 మిల్లీమీటర్ల వర్షం..

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నాలుగో తేదీ నుంచి ఐదో తేదీ ఉదయం 8.30 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 404 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సరాసరి 13.5 మిల్లీ వర్షపాతం నమోదైంది. అదే రోజు సాయంత్రం 5 గంటల వరకు మరో 26.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇక, మంగళవారం రాత్రి నుంచి బుధవారం (6వ తేదీన) ఉదయం 8.30 గంటల వరకు 725.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సరాసరి 24.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో 270.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సరాసరి 9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం జిల్లాలో అన్ని మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా ఎల్ఎన్‌పేట, హిరమండలం, కొత్తూరు, ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం, జి.సిగడాం, కవిటి, సోంపేట, శ్రీకాకుళం, కంచిలి, ఆమదాలవలస, సరుబుజ్జిలి, రణస్థలం, వజ్రపుకొత్తూరు మండలాల్లో దంచికొట్టింది.

ముంపు అంచనాలో సిబ్బంది..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నీటి ముంపునకు గురైన వరి పంటను గుర్తించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. మంగళ, బుధవారాల్లో జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడటంతో కొన్నిచోట్ల వరి పొలాలు మునిగాయి. వరి పనలతో కొంత నీట మునగగా, కోసిన వరి పంట మరి కొన్నిచోట్ల నీట మునిగింది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు అందిన సమాచారం మేరకు 358 హెక్టార్ల మేర నేల కొరగ్గా, 900 హెక్టార్ల మేర కోసిన వరి పంట నీట మునిగింది. ఇంకా గుర్తించే పనిలో వ్యవసాయ అధికారులు ఉన్నారు. రైతుల వారీగా గుర్తించేందుకు ప్రత్యేకంగా నాలుగు బృందాలను నియమించారు. వర్షం తెరిపిచ్చాక ముంపునకు గురైన వరి పొలాలను పూర్తి స్థాయిలో గుర్తించనున్నారు. వాస్తవంగా జిల్లాలో ఈ ఏడాది 3 లక్షల 53వేల ఎకరాల్లో వరి సాగు అయింది.

3900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అప్పటికే ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రక్రియ వేగవంతం చేశారు. ఆన్‌లైన్ చేసి కొనుగోలు చేయాలంటే ఆలస్యమవుతుందని.. ఆఫ్‌లైన్‌లో కూడా కొనుగోలు చేసే అవకాశం కల్పించారు. తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు రంగంలోకి దిగి నూర్చిన వరి పంటను కొనుగోలు చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. 2946 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసినట్టు బుధవారం సాయంత్రానికి రికార్డుల్లో నమోదై ఉంది. కొనుగోలు చేసి, ఇంకా రికార్డుల్లో నమోదు చేయాల్సిన 1000 మెట్రిక్ టన్నుల వరకు ఉండొచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.

● సేవలు భేష్..

తుఫాన్ నేపథ్యంలో వలంటీర్లు అందించిన సేవలపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ప్రజలకు వచ్చిన కష్టాల్లో పాలు పంచుకున్నారు. వర్షాలను సైతం లెక్క చేయకుండా వివిధ ఆస్పత్రుల్లో ఉన్న రోగులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న రైతులకు అండగా నిలిచారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారు. దగ్గరుండి సురక్షితంగా ధాన్యం తరలించారు. రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా సకాలంలో ఆదుకున్నారు. వీరి సేవలను రైతులు కొనియాడుతున్నారు. ఇక, ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై కూడా రైతాంగం హర్షం వ్యక్తం చేసింది.



జి.సిగడాం: రైల్వేస్టేషన్ సమీపంలో అండర్‌పాసేజ్ కింద చేరిన నీరు

● వర్షాన్ని సైతం లెక్కచేయక..



దీపకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ విజయ

కాశీబుగ్గ: పలాస మండలం అమలకుడియా పంచాయతీ వీరభద్రాపురం గ్రామానికి చెందిన కుసుమూరు దీపకు రెండు కిడ్నీలు పాడైపోవడంతో గాజువాకలో డయాలసిస్ సేవలు పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ బగాది విజయ జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ ఎలాగైనా పింఛన్ అందించాలని పలాస నుంచి గాజువాక వరకూ 250 కిలోమీటర్లు ప్రయాణించి రూ.10 వేలు అందజేశారు.



వర్షపాతం ఇలా.. (మి.మీ.లలో)

రణస్థలం	లావేరు	పొందూరు	జి.సిగడాం	ఎచ్చెర్ల	మెళియాపుట్టి	హిరమండలం	బూర్జ	శ్రీకాకుళం	పాతపట్నం	సారవకోట	కోటబొమ్మాళి	కొత్తూరు	ఎల్.ఎన్.పేట	నరసన్నపేట
75.8	74.2	46.2	38.4	34.8	32.4	29	28.4	25.4	25.2	24.6	24.4	23.8	23.4	22.8

జలుమూరు	ఆమదాలవలస	పోలాకి	గార	సరుబుజ్జిలి	ఇచ్ఛాపురం	నందిగాం	సంతబొమ్మాళి	కవిటి	కంచిలి	టెక్కలి	సోంపేట	పలాస	మందస	వజ్రపుకొత్తూరు
20.4	19.8	16.8	16.6	15.2	15.2	14.2	14	12.4	11.8	11.6	8.6	7.8	6.4	6







శ్రీకాకుళం నగరంలో జోరువానలో ప్రజాజీవనం

అనధికారికంగా ఆయుధాలు కలిగిన వారిపై నిఘా



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక, సెబ్ అదనపు ఎస్పీ మణికంఠ

శ్రీకాకుళం క్రైమ్ : అనధికారికంగా ఆయుధాలు కలిగి ఉన్న వారిపై నిఘా పెట్టాలని, పోలీసులు, సెబ్ అధికారులు సమన్వయంతో పనిచేసి నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కార్డన్ సెర్చ్ నిర్వహించి గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ విజయ నాగమణికంఠ పాల్గొన్నారు.

● పులికాదు.. దుమ్మలగుండు

మండల కేంద్రంలోని మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాలకు కొద్దిదూరంలో పులి పాదముద్రలు ఉన్నాయంటూ బుధవారం కొందరు స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు పాదముద్రలను క్షుణ్ణంగా పరిశీలించారు. అవి పులి పాదముద్రలు కావని చెప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. దీనిపై పాతపట్నం రేంజర్ రాజశేఖర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా అది దుమ్మలగుండు అనే జంతువు పాదముద్రలని, పులి ఒడిశా రాయగడ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలిసిందన్నారు. – మెళియాపుట్టి

● అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

నవభారత రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అస్తమించని సూరీడని, ఆయన రూపొందించిన రాజ్యాంగం ఆదర్శనీయమని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా దళిత, బహుజన సంఘాల నాయకులతో కలసి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణానికి అంబేడ్కర్ కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు డాక్టర్ కంతవేణు, తైక్వాండో శ్రీను, యజ్జల గురుమూర్తి, పోతల దుర్గారావు, ఎ.ప్రతాప్, సీర రాజేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సుజాత పాల్గొన్నారు. – శ్రీకాకుళం

వారు చిక్కితేనే.. గుట్టు వీడేది!

గార ఎస్‌బీఐలో బంగారం మాయం కేసు

- చైన్ సిస్టమ్‌లా చేతులు మారిన తాకట్టు బంగారం
- ప్రైవేటు వ్యక్తులతో బ్యాంకు ఉద్యోగులు కుమ్మక్కు
- 7 కిలోల బంగారం మిస్సింగ్ వెనక పది మందికి పైగా ప్రమేయం
- బంగారంతో కోట్లాది రూపాయల టర్నోవర్
- పరారీలో కీలక వ్యక్తులు
- పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: నగదు అక్రమ లావాదేవీలు, కుంభకోణాల్లో ఎక్కువగా వినిపించే పేరు చైన్‌సిస్టమ్. గొలుసుకట్టుగా ఏర్పడి ఒకరి నుంచి మరొకరు మోసాలకు పాల్పడుతుంటారు. ఇదే తరహా మోసం గార స్టేట్‌బ్యాంకులో బంగారం మాయం కేసులో జరిగినట్లు తెలుస్తోంది. గార స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో తాకట్టు బంగారం మిస్సింగ్ వెనక పది మందికి పైగా ఉన్నారు. ఇప్పటివరకు ఐదుగురిపైనే కేసు నమోదైనా తీగ లాగితే డొంక కదిలినట్టు అక్రమార్కుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మాయమైన బంగారం ప్రైవేటు లోన్ కన్సలెన్సీలు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద ఉన్నాయి. పరారీలో ఉన్న ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, బ్యాంకు ఉద్యోగి పట్టుబడితే తప్ప కేసు కొలిక్కి వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్టుగా ఇక్కడ తాకట్టు బంగారాన్ని ప్రసాదంలా అనేక చోట్ల పంచి పెట్టి, అవినీతిలో భాగస్వామ్యం చేసుకున్నారు.

వీరు సూత్రధారులు.. వారు పాత్రధారులు

గార స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో దాదాపు రూ.4కోట్ల 70 లక్షల విలువైన 7కిలోల బంగారు ఆభరణాలు మాయమైన విషయం తెలిసిందే. ఇందులో బ్యాంకులో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు సూత్రధారులైతే, ప్రైవేటు లోన్ కన్సల్టెన్సీ, ఫైనాన్స్ సంస్థలు పాత్రధారులుగా ఉన్నాయి. వీరితో సంబంధిత ఎస్‌బీఐ ఉద్యోగులు ఎన్నాళ్లగానో నడుపుతున్న గూడుపుఠాణి ఎట్టకేలకు బయటపడింది. తమ బ్రాంచ్‌లో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని ప్రైవేట్ లోన్ కన్సల్టెన్సీలతో కుమ్మక్కై పక్కదారి పట్టించారు. ఇక్కడ బంగారాన్ని చైన్ సిస్టమ్‌లా ఆయా సంస్థల వద్ద మారు తాకట్టు పెట్టి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారు. వాటితో వచ్చే వడ్డీతో ఎంజాయ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంకు ఉద్యోగులతో పాటు తిరుమలరావు, సుధాకర్ అనే వ్యక్తుల ప్రమేయం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం.

చైన్ సిస్టమ్‌లా..

ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారం స్ట్రాంగ్ రూముల్లోని సేఫ్‌ల్లో భద్రంగా ఉండాల్సింది పోయి ఆ బంగారాన్ని గుట్టు చప్పుడు కాకుండా తీసేసి ప్రైవేటు వ్యక్తుల చేతికి అందించారు. వాటితో కోట్లాది రూపాయల మేర మారు లోన్ తీసుకుని లావాదేవీలు జరిపారు. అలాగని ఒక దగ్గరే ఉంచారనుకుంటే పొరపాటే. గార బ్రాంచి నుంచి తీసుకెళ్లిన తాకట్టు బంగారాన్ని ఒక కన్సల్టెన్సీ వద్ద పెట్టగా, ఆ కన్సల్టెన్సీ తిరిగి ఆ బంగారాన్ని మరో ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పెట్టారు. అక్కడి నుంచి మరో చేతికి వెళ్లినట్టు తెలుస్తోంది. చైన్ సిస్టమ్‌లా ఖాతాదారుల తాకట్టు బంగారం అనేక మంది చేతులు మారింది. ఈ క్రమంలో ఆ బంగారం ఎటువంటి మార్పులు చెందిందో ఎవరికీ తెలియని పరిస్థితి. తాకట్టు బంగారాన్ని మార్చేసి, అదే ఆకారంలో క్వాలిటీ లేని బంగారు ఆభరణాలు తయారు చేసి పెట్టే అవకాశం కూడా ఉందనేది ఖాతాదారుల అనుమానం.

ఇతర బ్రాంచ్ ఉద్యోగుల పాత్ర

ఈ వ్యవహారం ఒక్క గార బ్రాంచికే పరిమితం కాలేదు. ఇందులో జిల్లాలో వివిధ బ్రాంచ్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఇక్కడ ఉద్యోగులు వారి సాయంతోనే తాకట్టు బంగారాన్ని పక్కదారి పట్టించారు. ఇప్పుడా ఉద్యోగులపై పోలీసు అధికారులు నిఘా పెట్టారు. ఇప్పటికే ఒక ఉద్యోగిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. పరారీలో ఉన్న ప్రైవేటు కన్సల్టెన్సీ ప్రతినిధులు, మరో బ్యాంకు ఉద్యోగి పట్టుబడితే మొత్తం బండారం బయటపడనుంది. మిస్సయిన 60 బ్యాగులు వివిధ ప్రైవేటు సంస్థల వద్ద ఉన్నట్టు సమాచారం. వాటిలో కొన్ని పోలీసులు రికవరీ చేసినట్టు కూడా తెలుస్తోంది. అయితే, దీనిపై పోలీసు వర్గాలు స్పష్టత ఇవ్వడం లేదు.

ప్రత్యేక బృందాల ఆరా..

గార బ్రాంచిలో జరిగిన అవినీతి, దాని వెనక ఉన్న వ్యక్తులు ఎక్కువగా ఉండటంతో జిల్లా ఎస్పీ రాధిక రంగంలోకి దిగారు. ఏ, బీ బృందాలను నియమించారు. వారిచేత విచారణ మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఐదుగురిపై కేసు నమోదైనప్పటికీ దీంట్లో పది మందికి పైగా ఉన్నారని భావించడంతో లోతుగా విచారణ జరిపించే పనిలో పడ్డారు. ఇదొక గార బ్రాంచికే పరిమితం కాదనే అభిప్రాయంతో పోలీసు వర్గాలు ఉన్నాయి. అనేక కోణాల్లో గుట్టు విప్పాల్సిన పరిస్థితి ఉంది.

క్యూ కట్టిన ఖాతాదారులు

గార: మండల కేంద్రం గారలోని స్టేట్ బ్యాంకు బ్రాంచిలో తనఖా పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు ఖాతాదారులు ప్రయత్నం చేస్తున్నారు. బుధవారం పలువురు ఖాతాదారులు తాము పెట్టిన బంగారానికి సంబంధించి రుణం చెల్లించి తీసుకున్నారు. గత మూడు రోజులుగా ప్రతి రోజూ 10 నుంచి 15 మంది ఖాతాదారులకు విడిపించేందుకు అవకాశమిచ్చారు. పోయిన బంగారానికి సంబంధించి వారి ఖాతా వివరాలను ప్రత్యేక కౌంటర్ ద్వారా సిబ్బంది తెలియజేస్తున్నారు.



స్టేట్‌బ్యాంకు వద్ద ఖాతాదారులు

సాఫ్ట్ టెన్నిస్ పోటీలు వాయిదా

పాతపట్నం: మండల కేంద్రంలోని పాతపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో ఈ నెల 9, 10వ తేదీల్లో జరగాల్సిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలను వర్షం కారణంగా వాయిదా వేసినట్లు జిల్లా సాఫ్ట్ టెన్నిస్ జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులు గురాడి అప్పన్న, పనుకు మోహన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహిస్తామని చెప్పారు.

ఫొటోషూట్‌కు వెళ్లి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి
- ముగ్గురికి గాయాలు



మృతుడు మృత్యుంజయ, గాయపడిన సాయి

సోంపేట: అతివేగం ఒకరి ప్రాణాన్ని బలిగొంది. సోంపేట మండలం బారువ కంబ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లూరుకు చెందిన మృత్యుంజయ బెహరా(36) మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లూరు గ్రామానికి చెందిన చక్రికి మరో రెండు రోజుల్లో వివాహం. ఫొటోషూట్ తీసేందుకు ఇచ్ఛాపురంలోని అత్త వారింటికి ఉదయం కారులో బయల్దేరారు. చక్రితో పాటు చిన్నాన్న మృత్యుంజయ బెహరా, స్నేహితుడు సురేంద్ర, ఫొటోగ్రాఫర్ సాయి వెళ్లారు. ఇచ్ఛాపురంలో షూట్ పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారి మీదుగా గొల్లూరు వెళ్లాల్సి ఉన్నా పెళ్లి వస్తువులు కొనేందుకు సోంపేట వచ్చారు. వస్తువులు కొని మధ్యాహ్నం 2 గంటల సమయంలో బారువ కంబ వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న సర్వేరాయిని ఢీకొట్టి కాలువలో పడి పోయింది. ఈ ఘటనలో వెనుక సీటులో కూర్చున్న మృత్యుంజయ బెహరా మృతి చెందగా, ఫొటోగ్రాఫర్ సాయికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను వెంటనే బారువ సామాజిక ఆసుపత్రికి తరలించారు. సాయిని టెక్కలి ఆస్పత్రికి రిఫర్ చేశారు. మృతుడు మృత్యుంజయ బెహరా మందసలో టి.వి.మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అన్నయ్య కుమారుడి పెళ్లి పనుల్లో సాయం చేసేందుకు వచ్చి కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. మృతుడికి భార్య కల్పన, మూడేళ్ల కుమార్తె అంకిత ఉన్నారు. ప్రస్తుతం కల్పన గర్భిణి. మృత్యుంజయ బెహరా మృతి చెందడంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. పెళ్లి సందడి జరగాల్సిన గొల్లూరులో విషాదఛాయలు అలముకున్నాయి. సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు బాధిత కుటుంబానికి సంతాపం తెలియజేశారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. బారువ ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ చిరంజీవి

9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈ నెల 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. జిల్లా జడ్జి చాంబర్‌లో బుధవారం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్ని సూర్యారావు, సెక్రటరీ పొన్నాడ రాముతో సమావేశం నిర్వహించారు. న్యాయవాదులంతా జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీచేయడానికి ప్రయత్నించాలన్నారు. సమావేశంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీదేవి, నాలుగో జిల్లా అదనపు న్యాయమూర్తి మహేంద్ర ఫణికుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పోలీసులతో సమానంగా హోంగార్డుల సేవలు



హోంగార్డులు, అధికారులతో ఎస్పీ జి.ఆర్.రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: హోంగార్డులు పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ పోలీసు శాఖలో కీలకంగా మారారని ఎస్పీ జి.ఆర్. రాధిక అన్నారు. ఎచ్చెర్లలోని ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో కమ్యూనిటీ హాలులో బుధవారం హోం గార్డుల 61వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు గాసయ్య కుమారుడు రామారావుకు హోంగార్డు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఉద్యోగ విరమణ చేసిన రాజారావుకు రూ.4.30 లక్షల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం హోంగార్డులకు బహుమతులు అందజేశారు. ఎన్నికలు, శాంతిభద్రతలు, నేర పరిశోధన, పెట్రోలింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి విధులను హోంగార్డులు సమర్థంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. జిల్లాలో ప్రస్తుతం 739 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వి.ఎస్.మణికంఠ, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు కె.బాలరాజు, ప్రసాదరావు, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

- జీపీఎస్ విధానంతో మరింత పారదర్శకత
- డీసీసీబీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు

పోలాకి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ధాన్యం కొనుగోలులో దళారులకు ఎక్కడా చోటులేదని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు స్పష్టంచేశారు. బుధవారం పోలాకి పీఏసీఎస్ ప్రాంగణంలో వ్యవసాయాధికారి పి.చిరంజీవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న నేపథ్యంలో ఈ ఏడాది మద్దతు ధరతో కూడిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సచివాలయ స్థాయిలో ఏర్పాటుచేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రంగుమారిన ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు సహకరిస్తారనే ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో కంటే మిన్నగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిల్లర్ల వద్ద దళారీ వ్యవస్థపై ఉక్కుపాదం వేసేలా తీసుకున్న నిర్ణయాలు కొంతమందికి మింగుడుపడటం లేదని, అటువంటి వారు తప్పుడు ప్రచారాలు చేసి లబ్ధిపొందాలని చూస్తున్నారని, ఈవిషయంలో అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తగా జీపీఎస్ విధానం ద్వారా ట్రక్కులు, ట్రాక్టర్లతో రైతులు మిల్లుల వద్దకు వెళ్లాల్సిన అవసరం వుండదని తెలిపారు. వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ముందస్తు అప్రమత్తతతో చాలావరకు పంటనష్టాన్ని తగ్గించగలిగామని పేర్కొన్నారు. తడిసిన ధాన్యం పనలపై లీటరు నీటికి 50గ్రాముల చెప్పున ఉప్పును ద్రావణంగా చేసి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు పంచిరెడ్డి సింహాచలం, మజ్జి లక్ష్మీనారాయణ, చింతాడ భీమారావు, గేదెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైకత శిల్పి హరికృష్ణకు అవార్డు



ఉత్తమ అవార్డు అందుకున్న గేదెల హరికృష్ణ(ఎడమ)

ఆమదాలవలస రూరల్: మండలంలోని గాజులకొల్లివలసకు చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణకు అంతర్జాతీయ సైకతశిల్ప కళా ఉత్సవాల్లో ఉత్తమ అవార్డు దక్కించుకున్నారు. ఒడిశా రాష్ట్రం పూరీలో ఈ నెల 1 నుంచి 5 వరకు నిర్వహించిన ఉత్సవాల్లో రాష్ట్రం తరపున అద్భుతమైన సైకత శిల్పాలు తీర్చిదిద్దారు. పర్యావరణ పరిరక్షణ, ప్రసిద్ధి చెందిన కూర్మనాథస్వామి దేవాలయ చిత్రాలను సెలక్ట్ కమిటీ ఎంపిక చేసి ఉత్తమ అవార్డును అందజేసినట్లు హరికృష్ణ తెలిపారు. ఈ ఉత్సవాల్లో అమెరికా, రష్యా, శ్రీలంక వంటి దేశాల నుంచి మొత్తం 120 మంది కళాకారులు పాల్గొన్నట్లు చెప్పారు.అందులో మన రాష్ట్రం తరపున ఉత్తమ అవార్డుతో పాటు సిల్వర్ షీల్డ్ అందజేసినట్లు తెలిపారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న సీఐ నాగేశ్వరరావు, ఎస్‌ఐలు చంద్రమోహన్,జి.వి.రమణ

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల గంజాయి, నాటుసారా, మద్యం వంటి కేసుల్లో ప్రాపర్టీని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో సీఐ, ఎస్‌ఐలను ఎస్పీ రాధిక అభినందించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాకుళం సెబ్ సీఐ టి.నాగేశ్వరరావు, పొందూరు ఎస్‌ఐ వై.చంద్రమోహన్, సోంపేట ఎస్‌ఐ జి.వి.రమణలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సెబ్ అదనపు ఎస్పీ విజయ నాగమణికంఠ పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు..



స్వామిని దర్శించుకున్న గురునాథ్ యాదవ్ తదితరులు

టెక్కలి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ టెక్కలికి చెందిన యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.గురునాథ్ యాదవ్ గత నెల 8న టెక్కలిలో ప్రారంభించిన పాదయాత్ర బుధవారం తిరుమల చేరుకుంది. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామిని ఆయన దర్శించుకున్నారు. సుమారు 28 రోజుల పాటు వివిధ జిల్లాలను దాటుకుంటూ తిరుమల చేరుకున్నానని, వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలనే ఆకాంక్షతో చేపట్టిన పాదయాత్ర ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగిందని గురునాథ్‌యాదవ్ 'సాక్షి'కి తెలియజేశారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): న్యాయవాదుల, ప్రజల హక్కులను హరించే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-23ను తక్షణమే రద్దు చేయాలని న్యాయవాదులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, ఎం.భవానీప్రసాద్, రాష్ట్ర బార్ అసోసియేషన్ మెంబర్ గేదెల వాసుదేవరావు, పీస జయరాం, కూన అన్నంనాయుడు, మామిడి క్రాంతి, సిస్టు రమేష్, ఎన్ని రమేష్, ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, సూర వేణుగోపాలరావు, గురుగుబిల్లి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో విద్యార్థుల ఘర్షణ!

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వసతి గృహంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి జన్మదిన వేడుకలకు సంబంధించి మంగళవారం రాత్రి స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. వేడుకల్లో భాగంగా బాణసంచా కాల్చడంతో ఇతరు విద్యార్థులు తమకు ఇబ్బంది కలుగుతుందని చెప్పడంతో ఘర్షణకు దారితీసింది. వెంటనే వసతి గృహం సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులను వారి గదులకు పంపించారు. చీఫ్ వార్డెన్ విజయభాస్కర్, రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్‌లు వివాదానికి కారణమైన విద్యార్థులను గుర్తించి బుధవారం ఘటనపై ఆరాతీశారు. క్రమశిక్షణగా మెలగకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, వివాదానికి సంబంధించి వీసీ వెంకటరావు కమిటీ వేయగా.. 12 మంది విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు సిఫారసు చేశారు.

నేటి నుంచి డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వాస్తవానికి ఐదో తేదీ నుంచే జరగాల్సి ఉండగా మిచాంగ్ తుఫాన్ వల్ల ఐదు, ఆరో తేదీల్లో నిర్వహించాల్సిన పరీక్షలు వాయిదాపడ్డాయి. 5న జరగాల్సిన పరీక్ష ఈ నెల 21కి, ఆరున జరగాల్సిన పరీక్ష 22వ తేదీకి రీషెడ్యూల్ చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. 99 కళాశాలల నుంచి రెగ్యులర్, సప్లిమెంటరీగా 10481 మంది హాజరవుతారన్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మాతా, శిశు మరణాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతా, శిశు మరణాలకు ఆస్కారం లేని విధంగా వైద్య ఆరోగ్య, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఆస్పత్రి ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. గుప్పెడుపేట, రెంటికోట, రట్టిలలో జరిగిన గర్భిణుల మరణాలపై విచారణ జరిపారు. అనంతరం పలువురికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

వరికుప్ప దగ్ధం



కాలిపోయిన కుప్పను పరిశీలిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: మండలంలోని జలకలింగుపురంలో ఎస్.లక్ష్మీనారాయణ అనే రైతుకు చెందిన వరి కుప్ప మంగళవారం అర్ధరాత్రి కాలిపోయింది. 1.2 ఎకరాలకు సంబంధించిన వరి ఓవులను కల్లంలో కుప్పగా ఉంచగా.. మొత్తం కాలి బూడిదవ్వడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. తహశీల్దార్ సరోజిని, ఆర్‌ఐ వైకుంఠరావు, వీఆర్‌ఓ సత్యనారాయణ ఘటనా స్థలాన్ని బుధవారం పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేస్తామన్నారు. కాగా, ప్రమాదానికి గల కారణం తెలియలేదు.

ఉత్సాహంగా టెన్నికాయిట్ ఎంపికలు



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

కాశీబుగ్గ: జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన జిల్లా జట్టు ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి పట్ట తవిటయ్య పర్యవేక్షణలో జరిగిన ఎంపికల్లో ముందుగా పురుషుల జట్టుకు కె.గోవిందరావు, సీహెచ్ తారకేశ్వరరావు, ఎం.మణికంఠ, పి.జగదీష్ పాత్రో, స్టాండ్‌బైగా బి.సిద్ధార్థ, ఎల్.దిలీప్ అర్హత సాధించారు. అనంతరం మహిళల జట్టుకు పి.ప్రవళిక, అంకితకుమారి, సుందరి, శ్రావణి పాత్రో, జె.భవాని, స్టాండ్‌బైగా యు.దీపిక, పి.పుష్పలత అర్హత సాధించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.చిట్టిబాబు, వ్యాపారవేత్త మల్లా భద్రయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ పద్మలోచనం, పి.గజేంద్ర, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.